AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
13-5-2026 (Wednesday)
MAIN EDITION

## సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 12వ తరగతి బోర్డు పరీక్షల ఫలితాలు నేడు విడుదలయ్యాయి. పరీక్షల నియంత్రణ అధికారి సన్యం భరద్వాజ్ ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ సంవత్సరం మొత్తం 85 శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు బోర్డు స్పష్టం చేసింది. ఈ సంవత్సరం 12వ తరగతి పరీక్షల్లో 85 శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఫలితాల శాతం తగ్గింది. గత సంవత్సరం కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం 3 శాతం కంటే ఎక్కువగా క్షీణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఫలితాల విడుదల ప్రక్రియను బోర్డు పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ స్వయంగా పర్యవేక్షించి వివరాలను వెల్లడించారు.

## హైదరాబాద్‌లో మరో నేపాలీ గ్యాంగ్ భారీ దోపిడీ

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో నేపాలీ గ్యాంగ్‌ల దోపిడీలు ఆగడం లేదు. ఇటీవల రిటైర్డ్ ఐపీఎస్ భార్యను హత్య చేసి దోపిడీ చేసిన విషయం మరువక ముందే మరో ఘటన వెలుగు చూసింది. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గల్ఫ్ ఎంక్లేవ్‌లో నివాసం ఉండే డాక్టర్ విజయలక్ష్మి, మురళీమోహన్ దంపతులకు మత్తు మందు ఇచ్చి, కాళ్లు చేతులు కట్టేసి నేపాలి ముఠా దోపిడీకి పాల్పడింది. 60 తులాల బంగారం, రూ. 30 వేలు దొంగలించినట్లు బాధితులు తెలిపారు. 13 రోజుల క్రితం పనిలో చేరిన ఇద్దరు నేపాలీలతో పాటు మరో ఐదుగురు కలిసి ఈ దోపిడీకి పాల్పడినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మరింత పడిపోయిన రూపాయి విలువ



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** రూపాయి మారకం విలువ మరింత పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి ఇంట్రాడేలో అత్యంత కనిష్ట స్థాయి 95.80కి దిగజారింది. అమెరికా - ఇరాన్ సంఘర్షణ నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన ధరల నుంచి ఎదురవుతున్న నిరంతర ఒత్తిడి దేశ స్థూల ఆర్థిక దృక్పథాన్ని మరింత దెబ్బతీసింది.

### ముందుగానే రుతుపవనాలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో ఈ సీజన్‌లో ముందుగానే రుతుపవనాలు రానున్నాయి. సాధారణంగా మే 20–22 తేదీల మధ్య వచ్చే రుతుపవనాలు.. ఈసారి సుమారు 5–6 రోజుల ముందుగానే.. మే 16–17 నాటికి అండమాన్ సముద్ర ప్రాంతాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది.

### భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు ఇవ్వాలి: కవిత



**అక్షరటుడే, హైదరాబాద్:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖకు కీలక డిమాండ్లు చేశారు. నిందితుడు భగీరథ్ దేశం విడిచి పారిపోకుండా తక్షణమే లుకౌట్ నోటీసులు జారీ చేయాలని ఆమె కోరారు.

# బల పరీక్షలో నెగ్గిన విజయ్



**తమిళనాడులో కీలక పరిణామం చోటు చేసుకుంది. అసెంబ్లీలో నిర్వహించిన బల పరీక్షలో సీఎం విజయ్ నెగ్గారు. టీవీకే ప్రభుత్వానికి 144 మంది ఎమ్మెల్యేలు మద్దతు తెలపడం గమనార్హం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలుచుకోగా.. కాంగ్రెస్ వామపక్షాలు, ఇతర పార్టీలు మద్దతు ఇచ్చాయి. కాగా.. అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల మద్దతుతో ఆయన బలం పెరిగింది.**

- అక్షరటుడే, నేషనల్ డెస్క్

- టీవీకే ప్రభుత్వానికి 144 మంది ఎమ్మెల్యేల మద్దతు
- వాకౌట్ చేసిన డీఎంకే
- అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేల సపోర్టు

అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 సీట్లు గెలుపొందిన విషయం తెలిసిందే. అయితే విజయ్ ఒక చోట రాజీనామా చేయడం, మరో ఎమ్మెల్యే బలపరీక్షలో పాల్గొనకుండా హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో ఆ పార్టీ బలం 106కు తగ్గింది. అయితే కాంగ్రెస్, వామపక్షాలు, ముస్లింలీగ్ మద్దతుతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ పార్టీలతో ఆయన బలం 118కు చేరగా.. బల పరీక్షలో ఏకంగా 144 ఓట్లు అనుకూలంగా రావడం గమనార్హం. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేల సపోర్టు బలనిరూపణకు అవసరమైన మెజార్టీకన్నా అధికంగా విజయ్‌కు మద్దతు వచ్చింది. అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల మద్దతుతో ఆయన బలం పెరిగింది. విజయ్‌కు వ్యతిరేకంగా డీఎంకే, ఏఐడీఎంకే పళనిస్వామి వర్గం, పీఎంకే ఉండగా.. కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ముస్లింలీగ్, అన్నాడీఎంకే షన్ముగం వర్గం అనుకూలంగా ఉంది. దీంతో విజయ్ విశ్వాస పరీక్షలో గెలుపొందారు.

### వ్యతిరేకంగా 22 ఓట్లు

టీవీకే ప్రభుత్వానికి అనుకూలంగా 144 మంది ఎమ్మెల్యేల మద్దతు తెలుపగా, విజయ్‌కు వ్యతిరేకంగా 22 మంది ఎమ్మెల్యేల ఓటు వేశారు. అసెంబ్లీ నుంచి 61 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. బలపరీక్ష సమయంలో డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. మరో ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు అయ్యారు. ఓటింగ్ సందర్భంగా ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన పార్టీలకు సీఎం విజయ్ ధన్యవాదాలు తెలిపారు. "కొందరు దీనిని మైనారిటీ ప్రభుత్వం అని పిలవాలనుకుంటే, మేము దానిని సంతోషంగా స్వీకరిస్తాము. మేము మైనారిటీ వర్గాలను కాపాడుతాము మరియు అన్ని వర్గాల ప్రజల కోసం పరిపాలిస్తాము," అని విజయ్ అన్నారు. ప్రభుత్వం లౌకికవాదం, సామాజిక న్యాయ సూత్రాలపై పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

### ఉదయనిధి విమర్శలు

టీవీకే ప్రభుత్వంపై ఉదయనిధి స్టాలిన్ విమర్శలు చేశారు. ప్రజామోదం పొందడంలో టీవీకే విఫలమైందన్నారు. 65 శాతం మంది ఓటర్లు విజయ్‌ను తిరస్కరించారని పేర్కొన్నారు. డీఎంకే కూటమిలోని పార్టీలే టీవీకేకు మద్దతిస్తున్నాయన్నది మర్చిపోవద్దని గుర్తు చేశారు. విజయ్‌కి నమ్మకం లేకపోవడం వల్లే రెండు చోట్ల పోటీ చేశారన్నారు. ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తి టీవీకేకు లేదన్నారు. అనంతరం బల పరీక్ష సమయంలో డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.

## ఐ బొమ్మ మళ్లీ వచ్చేసింది..!

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** కొంతకాలంగా మూతబడిన ఐ బొమ్మ వెబ్‌సైట్ మళ్లీ యాక్టివ్ అయింది. వెబ్‌సైట్‌లో కొత్త చిత్రాలు ప్రత్యక్షం కావడంతో సినీ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ పోలీసులు గతంలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం అతడితోనే వెబ్‌సైట్ మూసివేయించారు. దీంతో సినీ పరిశ్రమ కొంతకాలంగా ఊపిరి పీల్చుకుంటుంది. అయితే మళ్లీ వెబ్‌సైట్ ప్రత్యక్షం కావడంతో టాలీవుడ్‌లో ఆందోళన నెలకొంది. ఇప్పుడు మళ్లీ దానిని ఎవరు మొదలు పెట్టారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## రూ.30 లక్షలకు 'నీట్' పేపర్ కొనుగోలు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. రాజస్థాన్‌లోని జమ్వా రామ్‌గఢ్‌కు చెందిన ఇద్దరు సోదరులు.. ప్రశ్నాపత్రాన్ని పరీక్షకు వారం ముందే గురుగ్రామ్‌కు చెందిన ఒక వైద్యుడి నుంచి రూ. 30 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం. రామ్‌గఢ్‌కు చెందిన మంగీలాల్, దినేష్ బివాల్‌లు.. నీట్ పరీక్షకు ఏప్రిల్ 26న గురుగ్రామ్‌లోని వైద్యుడి నుండి ఈ ఏడాది నీట్ యూజీ పేపర్‌ను కొనుగోలు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. సోదరులలో ఒకరు ఆ పేపర్‌ను సికార్‌లో వైద్య ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న తన కుమారుడికి ఇచ్చిన తర్వాత, వారు ఏప్రిల్ 29న దానిని పలువురికి విక్రయించినట్లు తెలిసింది.

## బంగారం కొనకండి.. పొదుపు పెంచండి: చంద్రబాబు



**అక్షరటుడే, ఏపీ:** అమరావతి అభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్తుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం నిడమర్రులో కిమ్స్ ఆస్పత్రి, బైసర్ స్కిల్ యూనివర్సిటీలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం పలు ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. ప్రజలు విలాసాలకు ప్రాధాన్యత తగ్గించి, పొదుపుపై దృష్టి సారించాలని సీఎం పిలుపునిచ్చారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనలను అందరూ పాటించాలని కోరారు. ఆడంబరాల కంటే భద్రత అర్థవంతంగా ఉండాలని, ప్రస్తుతం కాన్వాయ్‌లు ఒక ఫ్యాషన్‌గా మారిపోయాయని ఆయన వ్యాఖ్యానించారు.

## భగీరథ్ అరెస్ట్‌ను ఎవరూ ఆపలేరు: టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్




**అక్షరటుడే, హైదరాబాద్:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసు వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కీలకల వ్యాఖ్యలు చేశారు. మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన.. బండి భగీరథ్‌పై నమోదైన కేసు విచారణలో ఎలాంటి ఆలస్యం జరగడం లేదని తెలిపారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని వెల్లడించారు. భగీరథ్ అరెస్ట్ అవకుండా అడ్డుకోవడం ఎవరి వల్లా కాదని పేర్కొన్నారు. ఈ కేసు నుంచి బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదని వెల్లడించారు.

## తమిళనాడు ఓఎస్‌డీ నియామకం రద్దు

**అక్షరటుడే, చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వెనక్కి తగ్గారు. ఓఎస్‌డీ నియామకాన్ని రద్దు చేశారు. ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు, అసెంబ్లీలో నిరసనల నేపథ్యంలో జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివెల్‌ను ముఖ్యమంత్రి ఓఎస్‌డీగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వును తమిళనాడు ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ముఖ్యమంత్రి విజయ్‌కి జ్యోతిష్యుడు రికీ రాధన్ పండిట్ వెట్రివెల్‌ను నియమించిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. నెటిజన్లు విజయ్ తీరుపై మండిపడ్డారు. ఓ జోతిష్యుడిని ఓఎస్‌డీగా నియమించి, కేబినెట్ హోదా ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. మరోవైపు బుధవారం అసెంబ్లీలో ప్రతిపక్షాలు సైతం ఈ నిర్ణయాన్ని తప్పుబట్టాయి. దీంతో బుధవారం సభ ముగియగానే విజయ్ ప్రభుత్వం ఓఎస్‌డీ ఆయన నియామకాన్ని రద్దు చేసింది.



## ప్రధాని మోదీ కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య తగ్గింపు




**అక్షరటుడే, ఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించారు. ఎస్పీజీ ప్రోటోకాల్ ప్రకారం అవసరమైన భద్రతా అంశాలను పాటిస్తూనే.. వాహనాల సంఖ్యను తగ్గించారు. ఈ విషయాన్ని బుధవారం ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ ఇటీవల హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. ఈ మేరకు తన కాన్వాయ్‌లో సైతం వాహనాల సంఖ్య తగ్గించారు. గుజరాత్, అస్సాంలో పర్యటనలో ఆయన పరిమిత వాహన శ్రేణితో ప్రయాణించారు. కొత్తగా కొనుగోళ్లు చేయకుండా, సాధ్యమైన చోటల్లా తన కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాలను చేర్చాలని కూడా ప్రధాని కోరారు.

## ప్రధాని మాట పట్టించుకోని బీజేపీ నేత.. 50 కార్లతో ర్యాలీ



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ప్రజలను కోరిన విషయం తెలిసిందే. విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు స్వయంగా తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సైతం తగ్గించారు. అయితే ప్రధాని వ్యాఖ్యలను ఓ బీజేపీ నేత పట్టించుకోలేదు. ఏకంగా 50 కార్లతో ర్యాలీ తీశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక బీజేపీ నాయకుడు దాదాపు 50 వాహనాలతో కూడిన కాన్వాయ్‌లో ప్రయాణించాడు. మధ్యప్రదేశ్ టెక్స్‌ట్ బుక్ కార్పొరేషన్‌కు కొత్తగా నియమితులైన చైర్మన్ సౌభాగ్య సింగ్ ఠాకూర్ బాధ్యతలు స్వీకరించడానికి వెళ్తూ మద్దతుదారుల వాహనాలతో కలిసి ఉజ్జయిన్ నుంచి భోపాల్‌కు ప్రయాణించారు.

## జోగిపేటలో చెడ్డి గ్యాంగ్ కలకలం..



**అక్షరటుడే, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా జోగిపేటలో అర్ధరాత్రి వేళ దొంగలు వరుస చోరీలకు పాల్పడ్డారు. జన సంచారం లేని సమయం చూసి వాహనాల నుంచి డీజిల్‌ను మాయం చేశారు. కారులో వచ్చి నిమిషాల వ్యవధిలోనే ఈ దోపిడీలు ముగించడం గమనార్హం. అర్ధరాత్రి సమయంలో స్థానిక ఒక ప్రైవేట్ స్కూల్ ఆవరణలోకి చొరబడిన దొంగలు, అక్కడ పార్క్ చేసి ఉన్న బస్సుల నుంచి సుమారు 50 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. మరుసటి రోజు ఉదయం స్కూల్ యాజమాన్యం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. అదే రాత్రి మరో ప్రాంతంలో పార్క్ చేసి ఉన్న లారీని లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠా, ట్యాంక్ నుంచి 100 లీటర్ల డీజిల్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకెళ్లింది.